క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ లైన్ ఏబీ స్విచ్ పనులు జరుగుతున్నందున రాక్‌హిల్స్ కాలనీ, వీటీ కాలనీ, తిరుమల నగర్, సాయిశ్రీ కాలనీ, ఎస్ఎల్ఎస్ స్వామి కాలనీ, టీచర్స్ కాలనీ, మోహన్‌రెడ్డి కాలనీ, మీర్బాగ్ కాలనీ, పూజిత అపార్టుమెంట్, సూర్యలోక్ కాంప్లెక్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

11న పెన్షనర్ల మహాధర్నా

నల్లగొండ టూటౌన్: హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద ఈ నెల 11న నిర్వహించనున్న తెలంగాణ పెన్షన్‌దారుల మహాధర్నా జయప్రదం చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డు పర్సన్స్ అసోసియేషన్ (టప్రా) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నూకల జగదీష్‌చంద్ర, పందిరి శ్యాంసుందర్ కోరారు. గురువారం నల్లగొండ పట్టణంలోని అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కుకుడాల గోవర్ధన్, జిల్లా కోశాధికారి అబ్దుల్ ఖాదర్, వనం వాణిశ్రీ, భిక్షమయ్య, రమేష్ పాల్గొన్నారు.

పౌర సరఫరాల సంస్థ గిడ్డంగి తనిఖీ

నాంపల్లి: మధ్యాహ్న భోజనం పథకం బియ్యం రవాణాలో అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ అన్నారు. గురువారం నాంపల్లి పౌర సరఫరాల సంస్థ గిడ్డంగిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం కోసం పాఠశాలలకు పంపే సన్న బియ్యం రవాణాలో అక్రమాలు జరుగుతున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. పూర్తిగా విచారించి నివేదిక ప్రభుత్వానికి పంపుతామన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మర్రిగూడ : వీహెచ్‌పీఎస్ మర్రిగూడ, తిరగండ్లపల్లి, సరంపేట గ్రామశాఖల నూతన కమిటీని గురువారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయా గ్రామాల నూతన అధ్యక్షులుగా మునుకుంట్ల రమేష్, కాగు చెన్నయ్య, మాదుగుల దశరథ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు మేతరి రాములు, ప్రధాన కార్యదర్శి బొంత దశరథ, ఉపాధ్యక్షులు పొన్నం ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిల్లా తిరుమలేష్‌మాదిగ, మండల అధ్యక్షుడు మైలారపు రాజు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల వితరణ

మునుగోడు: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి మునుగోడు పట్టణానికి చెందిన పలువురు పూర్వ విద్యార్థులు గురువారం రూ.40వేల విరాళం అందజేశారు. ఆ నగదుతో పాఠశాల గోడలకు రంగులు వేయడంతోపాటు విద్యకు ఉపయోగపడే చిత్రాలను వేయించనున్నట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం సుంకరి భిక్షంగౌడ్ తెలిపారు. నగదు అందించిన మునుగోడు ఉన్నత పాఠశాల 1996–97 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్, జేసీబీ పట్టివేత

కనగల్: మండలంలోని ఎస్ లింగోటం గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న జేసీబీతోపాటు బోయినపల్లి నుంచి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. సంబంధిత వాహన డ్రైవర్లు, ఓనర్లపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ కే.రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ అనుమతులు ఉన్న చోటే ఇసుక తవ్వాలన్నారు. జేసీబీ సాయంతో ఇసుక తవ్వితే ఆ వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఇంటింటికీ బీజేపీ

చిట్యాల: వెలిమినేడులో బీజేపీ మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు అంశల అనిల్‌కుమార్ , వెల్ది రాఘవరెడ్డి, గద్దం వినోద్‌రెడ్డి, బూత్ కమిటీ ఇన్‌చార్జ్ ఉయ్యాల లింగ్వామి, శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ బొంతల వెంకటరెడ్డి, బొడ్డుపల్లి శ్రీకాంత్, కాటం లక్ష్మయ్య, గోలి యాదయ్య పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నల్లగొండ టూటౌన్: ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ అన్నారు. గురువారం నల్లగొండ పట్టణం 6వ వార్డు ఏఆర్‌నగర్‌లో మురికి కాలువలు, ఇళ్లకు వెళ్లి పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ గద్దం శ్రీనివాస్, జవాన్ వెంకన్న పాల్గొన్నారు.

శాలిగౌరారంలో భారీ వర్షం

శాలిగౌరారం: మండలంలో గురువారం రాత్రి సుమారు రెండు గంటలపాటు కుండపోతగా వర్షం కురిసింది. భారీ వర్షానికి రోడ్లు, గ్రామాల్లోని వీధులు వరదనీటి ప్రవాహంతో కాలువలను తలపించాయి. లోతట్టులో గల ఇళ్లలోకి వరదనీరు వచ్చి చేరింది. భారీ వర్షానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఊరూరా బోనాల వేడుకలు


తిప్పర్తి : రామలింగాలగూడెంలో బోనాలతో వెళ్తున్న మహిళలు


శాలిగౌరారం మండలకేంద్రంలో..

కేతేపల్లి: మండలంలోని గుడివాడ, ఇప్పలగూడెం గ్రామాల్లో గురువారం బోనాల పండగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ప్రదర్శనగా ఆలయం వద్దకు చేరుకున్నారు. బోనం కుండల్లో వండి తీసుకువచ్చిన నైవేద్యాన్ని ముత్యాలమ్మ తల్లికి సమర్పించారు. కోరిన కోర్కెలు తీరిన భక్తులు తమ మొక్కలు చెల్లించుకున్నారు. ఎడ్ల బండ్లను అందంగా అలంకరించి గ్రామాల్లో ప్రదర్శన నిర్వహించారు. వేడుకల్లో మాజీ సర్పంచ్ కట్ట శ్రవణ్, గ్రామస్తులు రాజకొండ సైదులు, రాచకొండ పురుషోత్తం, ఎ.జగన్నాథం, రాచకొండ జానకిరాములు, వేములకొండ హుస్సేన్, వేములకొండ లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్: శ్రావణమాసం సందర్భంగా కట్టంగూర్ మండలంలోని పలు గ్రామాల్లో గురువారం బోనాల పండుగ నిర్వహించారు. ఈదులూరు, చెర్వు అన్నారం, అయిటిపాముల, మల్లారం గ్రామాల్లో మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ముత్యాలమ్మ, మారెమ్మ అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించారు. కానుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: శ్రావణమాసం సందర్భంగా నార్కట్‌పల్లిలోని ముత్యాలమ్మ ఆలయంలో గురువారం బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. మహిళలు బోనాలను అందంగా అలంకరించి డప్పుచప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించి ఆలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చైర్మన్, కమిటీ సభ్యులు వసతులు కల్పించారు.

తిప్పర్తి : బోనాల వేడుకలను తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం గ్రామంలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఇంటికో బోనం ఎత్తుకుని డప్పుచప్పుళ్లతో బొడ్రాయి వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముత్యాలమ్మ ఆలయం వద్ద అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ సర్పంచ్ ముత్తినేని శ్రీదేవి శ్యాంసుందర్, మాజీ ఎంపీటీసీ ముత్తినేని అనూష నాగేశ్వర్‌రావు, నాయకులు ముత్తినేని శ్యాంసుందర్, నాగేశ్వర్‌రావు, వనపర్తి అంజయ్య, శ్రీరాములు, వలిశెట్టి మల్లయ్య గ్రామస్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ బోనాల పండుగ

శాలిగౌరారం: మండలంలోని పలు గ్రామాలలో గురువారం గ్రామదేవత ముత్యాలమ్మ బోనాలపండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ముత్యాలమ్మ దేవాలయాల వద్ద ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.


కేతేపల్లి : గుడివాడ ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న గ్రామస్తులు


కట్టంగూర్: బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


నార్కట్‌పల్లి: బోనాలతో మహిళలు

అవార్డులు అందుకున్న చేనేత కార్మికులు

చిట్యాల: మండలంలోని సుంకెనపల్లి గ్రామానికి చెందిన చిట్టిప్రోలు ధనుంజయ్య పోచంపల్లి డబుల్ ఇక్కత్ చీర నేసినందుకుగాను కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ధనుంజయ్యకు అవార్డుతోపాటు నగదును రాష్ట్ర చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అందజేశారు.


చిట్యాల : ధనుంజయ్యకు అవార్డు అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

చేనేత అవార్డు అందుకున్న అవ్వారి రవీందర్

చండూరు : మండలంలోని కొండాపురం గ్రామానికి చెందిన అవ్వారి రవీందర్ గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి అందుకున్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇక్కత్ రాజ్‌కోట్ చీరల విభాగంలో రవీందర్‌కు కొండా లక్ష్మణ్ బాపూజీ పురస్కారాల్లో భాగంగా అవార్డు అందజేశారు.

గట్టుప్పల్ చేనేత కార్మికులకు..

గట్టుప్పల్ : చేనేత రంగంలో ప్రతిభ కనబర్చి చీరలు తయారుచేసిన గట్టుప్పల్ మండల కేంద్రానికి చెందిన నలుగురు చేనేత కార్మికులు గాజుల అనిల్, కర్నాటి కృష్ణయ్య, మునగపాటి శ్రీనివాస్, గుర్రం యాదయ్యలు కొండా లక్ష్మణ్ బాపూజీ-2025 అవార్డుకు ఎంపికయ్యారు. వీరు గురువారం హైదరాబాద్‌లోని పీపుల్ ప్లాజాలో చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.


చండూరు : అవార్డు అందుకుంటున్న రవీందర్


గట్టుప్పల్ : అవార్డు అందుకుంటున్న చేనేత కార్మికుడు గాజుల అనిల్

జిల్లా కేంద్రంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

నల్లగొండ టూటౌన్: కల్తీ ఆహార అమ్మకాలపై ఫుడ్ సేఫ్టీ ఆన్ వీల్స్ గురువారం నల్లగొండ పట్టణంలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలోని ఎస్ఎల్‌బీసీ నుంచి డీవీకే రోడ్, క్లాక్‌టవర్, బస్టాండ్, మిర్యాలగూడ రోడ్డు, కలెక్టరేట్ వరకు ఉన్న 60కి పైగా హోటళ్లు, కిరాణా దుకాణాలు, పండ్ల దుకాణాలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మాంసం దుకాణాలు, టీ స్టాల్స్, బేకరీలతో సహా వివిధ ఆహార వ్యాపార కేంద్రాలను జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డా. ఎస్.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు చికెన్ సెంటర్ల నిర్వాహకులు అవగాహన రాహిత్యంతో రంగులు వాడుతున్నట్లు గుర్తించి నోటీసులు జారీ చేశామన్నారు. గడువు తీరిన, ఆరోగ్యానికి హానికరమైన ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి, సిబ్బంది ఎం.వెంకటపతి, ఎం.రమేష్, ఎ. మహేష్ పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

వన మహోత్సవం


మొక్క నాటుతున్న ఫారెస్టు ఆఫీసర్లు, విద్యార్థులు

నార్కట్‌పల్లి: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం ఏపీ లింగోటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నార్కట్‌పల్లి ఫారెస్టు బీట్ ఆఫీసర్ భవాని, కట్టంగూరు ఫారెస్టు బీట్ ఆఫీసర్ శిరీష.. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం జీవకోటికి ప్రాణాధారమైన మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను దత్తత తీసుకొని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లేపల్లి కాశయ్య, ఎఫ్సిబా, ఆర్.సత్యనారాయణ, వై. సత్యనారాయణ, ఎం.పద్మావతి, ఆదిమల్ల మణిరాజు, మహమ్మద్ ఆరిఫ్, హేమలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నీలగిరి పట్టణంలో భారీ వర్షం


నల్లగొండ పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్‌లో కురుస్తున్న భారీ వర్షం


వర్షంలో గొడుగుతో వెళ్తున్న యువతి

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. గంటపాటు కురిసిన భారీ వర్షానికి నీలగిరి పట్టణంలోని లోతట్టు కాలనీలు జలమయమయ్యాయి. పట్టణంలోని శివాజీనగర్ రోడ్, వీటీ రోడ్, రాష్ట్రపతి రోడ్, పాతబస్తీ, హిమగిరి కాలనీ, సూర్యవంశీ కాలనీ, చైతన్యపురి, జీవీగూడెం, ఎన్‌టీఆర్ నగర్, శాంతినగర్, లెప్రసీ కాలనీ, ఆర్‌టీసీ కాలనీ, శ్రీనగర్ కాలనీ, అసద్‌నగర్, బీటీఎస్, హైదరాబాద్ రోడ్‌లోని పలు కాలనీలు, రామగిరి తదితర ప్రాంతాల్లో వరద నీరు భారీగా ప్రవహించింది. రాత్రి 7.15 గంటల నుంచి 8.30 గంటల వరకు వర్షం భారీగా కురిసింది. భారీ వర్షానికి పలుచోట్ల మ్యాన్‌హోల్స్ మూతలు కొట్టుకుపోయాయి. ప్రధాన రోడ్లపై వరద నీటికి మ్యాన్‌హోల్ మూతలు కొట్టుకుపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు.

కృష్ణ కౌండిన్యకు అభినందన

రామగిరి(నల్లగొండ): అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందిన రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు సాహితీవేత్త డాక్టర్ తండు కృష్ణ కౌండిన్యను గురువారం పలువురు అభినందించారు. ప్రస్తుతం అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ తండు కృష్ణ కౌండిన్యకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతిని కల్పిస్తూ కళాశాల విద్యా కమిషనర్ శ్రీ దేవసేన ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రహత్ ఖానమ్, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య, దాశరథి పురస్కార గ్రహీత వేణు సంకోజు, ప్రముఖకవి మేరెడ్డి యాదగిరిరెడ్డి,డాక్టర్ ఎం.పురుషోత్తమాచార్య, తెలంగాణ సాహితీ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుకడాల గోవర్ధన్, ఎండీ.హసేనా అభినందనలు తెలియజేశారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

రామగిరి(నల్లగొండ): నల్లగొండ మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ బి.యాకుబ్‌నాయక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు నల్లగొండ మండలంలో 625 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. బేస్‌మెంట్ లెవల్ వరకు పూర్తి చేసిన లబ్ధిదారులకు రూ.లక్ష జమచేసినట్లు తెలిపారు.

పోషణవాటిక నిర్వహణపై శిక్షణ

నకిరేకల్ : కేతేపల్లి, శాలిగౌరారం, నకిరేకల్ మండలాల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నకిరేకల్ పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ వాటిక నిర్వహణపై గురువారం ఉద్యానవన శాఖ అధికారి ప్రవీణ్ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కూరగాయల, పండ్ల మొక్కల విత్తనాలను అంగన్‌వాడీ సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ అశ్ర అంజుమ్, సూపర్‌వైజర్లు భవాని, జ్యోతి కళావతి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

నార్కట్‌పల్లి: మండలంలోని ఏపీ లింగోటం గ్రామ శ్రీ పార్వతీశంభులింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విలువైన ఆభరణాలు, నగదు అపహరించినట్లు ఎస్ఐ డి.క్రాంతికుమార్ తెలిపారు. వివరాలు.. గుడిలోకి వెళ్లిన దుండగులు అమ్మ వారి 3 బంగారం పుస్తెలు, బంగారు నల్లపూసల గొలుసు, వెండి పళ్లెం, వెండి శ్రీ చక్రం, హుండీలో కొంత నగదు దోచుకుని పారిపోయారు. ఆలయ చైర్మన్ పోరెడ్డి నరసింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

మర్రిగూడ : మండలంలోని రాంరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు స్వయంగా తయారుచేసిన రాఖీలను మర్రిగూడ మండల కేంద్రంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీఓ జి.చినమునయ్య, ఎంఈఓ బిట్టు శ్రీనివాస్, ఎస్ఐ మునగాల కృష్ణారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లుకు కట్టి రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాడిగ అంజయ్య, ఉపాధ్యాయులు లెంకలపల్లి వెంకటేశ్వర్లు, రత్నకుమారి, విద్యార్థులు పాల్గొన్నారు.


తహసీల్దార్ శ్రీనివాసులుకు రాఖీ కడుతున్న చిన్నారులు

నలుగురిపై కేసు నమోదు

కనగల్ : మండలంలోని అమ్మగూడెం గ్రామ స్టేజీ వద్ద గంజాయి తాగుతున్న నలుగురు యువకులను కనగల్ పోలీసులు గురువారం పట్టుకున్నారు. ఎస్ఐ రాజీవ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణానికి చెందిన రిజ్వాన్, ఇమ్రాన్, సూర్యకిరణ్, అనుముల మండలానికి చెందిన ఇర్ఫాన్ అనే యువకులు అమ్మగూడెం స్టేజీ వద్ద అనుమానాస్పద రీతిలో కనిపించగా.. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని తనిఖీలు చేశారు. వారంతా గంజాయి తాగుతూ పట్టుబడగా కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ తెలిపారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై అవగాహన

కనగల్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 11 నిర్వహించే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై గురువారం కనగల్ పీహెచ్‌సీలో అంగన్‌వాడీ టీచర్లకు, ఉపాధ్యాయులకు, ఆశా వర్కర్లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గాదరి రామకృష్ణ మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలను ఒకటి నుంచి 19 ఏళ్ల పిల్లలందరికీ అందజేయాలన్నారు.

రేషన్ కార్డుల పంపిణీ

శాలిగౌరారం: ప్రభుత్వం మంజూరు చేసిన నూతన రేషన్‌కార్డులను గురువారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద తహశీల్దార్ జమీరుద్దీన్, ఎంపీడీఓ జ్యోతిలక్ష్మి లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, మార్కెట్ డైరెక్టర్ కూతాటి సోమయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేశ్, నాయకులు చామల జయపాల్‌రెడ్డి, చింత ధనుంజయ్య, జోగు శ్రీనివాసులు, వడ్లకొండ పరమేశ్, చిత్తలూరి జీడికల్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నల్లగొండ టౌన్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నల్లగొండలో గురువారం సుభాష్ విగ్రహం వద్ద సీఐటీయూ నాయకులు కార్మికులతో కలిసి ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు తుమ్మల వీరారెడ్డి మాట్లాడుతూ కార్మికులకు సుమారు ఐదు నెలలుగా వేతనాలు, బిల్లులు రాక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పోలె సత్యనారాయణ, అల్లి అనురాధ, దొడ్డి ఆండాలు, ఏకుల మహేశ్వరి, దేబోరా, వెంకటమ్మ, శంకరమ్మ, సైదమ్మ, నిర్మల, అలివేలు, ముత్యాలి, సుశీల, పుష్పలత, ఇందిర పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


నల్లగొండ టూటౌన్: చేనేత కార్మికులను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు


నల్లగొండ టూటౌన్ : చేనేత కార్మికులకు చెక్కు అందజేస్తున్న అధికారులు

నల్లగొండ టూటౌన్: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం చేనేత రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. గురువారం బీజేపీ పట్టణ టూటౌన్ అధ్యక్షుడు మిర్యాల వెంకటేశం అధ్యక్షతన నల్లగొండ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్షిత్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. అనంతరం చేనేత కార్మికులను సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, కోమటి వీరేశం, పోతెపాక లింగస్వామి, పిట్టల శ్రీనివాస్, తిరందాసు కనకయ్య, రాపోలు విద్యాసాగర్, కటకం శ్రీధర్, రాపోలు భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ టూటౌన్: జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం నల్లగొండ పట్టణంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం నుంచి పద్మానగర్ వరకు చేనేత కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో చేనేత కార్మికులకు సమావేశం నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి చేనేత జౌళి శాఖ ఏడీ ద్వారక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా త్రిఫ్ట ఫండ్ హ్యాండ్లూమ్ రూ.29 కోట్లు, పవర్ లూమ్ త్రిఫ్ట రూ.11 కోట్ల విలువ గల చెక్కులను చేనేత కార్మికులకు అందజేశారు. నైపుణ్యం కలిగిన చేనేత కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అభివృద్ధి అధికారి ప్రసాద్, సహాయ అభివృద్ధి అధికారులు గీతా రాణి, గోపాల్, చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి మురళి, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు పొట్టబత్తుల సత్యనారాయణ, కర్నాటి యాదగిరి, దుడుకు లక్ష్మీనారాయణ, వనం నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి అధిక ప్రాధాన్యం

నకిరేకల్ : చేనేత కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని నకిరేకల్ మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితాశ్రీనివాస్‌గౌడ్ అన్నారు. చేనేత సంఘం ఆధ్వర్యంలో గురువారం నకిరేకల్ పట్టణంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వృద్ధ చేనేత కార్మికులను సన్మానించారు. మృతిచెందిన చేనేత కార్మికుల కుటుంబీకులకు రూ.10 వేల చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మికులు నూతన పద్ధతుల్లో వృత్తిని మెరుగు పరుచుకోవాలన్నారు. చేనేత సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ చైర్మన్ చిలుకూరి లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, సిల్క్ సంఘం అధ్యక్షుడు పెండెం సదానందం, మాజీ అధ్యక్షుడు రావిరాల మల్లయ్య, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, లింగాల వెంకన్న, దుస్స సత్యనారాయణ పాల్గొన్నారు.


నకిరేకల్ : చేనేత కార్మికుల కుటుంబీకులకు చెక్కు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నకిరేకల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధ చేనేత కార్మికులను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎన్.సూర్యచంద్రరావు, చేనేత సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ చిలుకూరి లక్ష్మీనర్సయ్య, మాజీ అధ్యక్షుడు రావిరాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

చండూరు : చేనేత జాతీయ దినోత్సవాన్ని గురువారం చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో చండూరులో ఘనంగా నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు రాపోలు వెంకటేశం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షులు పులిపాటి ప్రసన్న, ఉభయ ఆలయాల చైర్మన్ రావిరాల నగేష్ సలహాదారుడు కోడి గిరిబాబు, ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాసులు, చిట్టిప్రోలు వెంకటేశం, కోమటి వీరేశం, గంజి యాదగిరి, గుంటి వెంకటేశం, కోడి శ్రీనివాసులు, కోడి వెంకన్న, రాపోలు ప్రభాకర్, చెరిపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


చండూరు : కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చేనేత కార్మికులు


నార్కట్‌పల్లి: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

చేనేతపై క్షేత్రస్థాయి పర్యటన

నకిరేకల్ : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్, కామర్స్ విభాగాల ఆధ్వర్యంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు క్షేత్రస్థాయిలో పట్టణంలోని వివిధ చేనేత కార్మికుల గృహాలను సందర్శించారు. వృత్తిలో ఎదురవుతున్న సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బెల్లి యాదయ్య, అధ్యాపకులు హరిత, రవీందర్, ఉపేందర్, నేత కార్మికులు శ్యామల, గోవర్ధన్, వంశీ, లింగయ్య, ధనలక్ష్మి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండల కేంద్రంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పద్మశాలి యువజన మండల అధ్యక్షుడు చెరుపెల్లి రఘుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షుడు గంజి రమేష్ ముఖ్య అతిథిగా పాల్గొని పద్మశాలి కళాకారులు సుంకి శీను, పిల్లలమర్రి శ్రీహరిలను సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్షుడు గర్దాసు వెంకటేశ్వర్లు, నామని ప్రభాకర్, పెండెం వెంకన్న, కొలను శ్రీనివాసు, వనం రమేష్, సంగిశెట్టి వేణు, చలమల్ల దశరథ, రుద్ర నాగరాజు, గంజి శ్రీను, యాదగిరి పాల్గొన్నారు.